క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

బెజ్జూర్: గత కొన్ని రోజులుగా కుంటలమానెపల్లి గ్రామంలో పాలువ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో బెజ్జూర్, కుంటల మానెపల్లి జట్లు తలపడగా బెజ్జూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.25వేల నగదు, షీల్డ్ అందజేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం పురుషోత్తమాచారి ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి విగ్రహానికి అభిషేకంతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ప్రసాద వితరణ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చాకటి బ్రహ్మయ్య, పూసాల బ్రహ్మయ్య, సుంకరి రమేశ్, ఏలేశ్వరం ప్రభాకర్, ఏలేశ్వరం శ్రీనివాస్, శ్రీరామ్ మోహన్, ఏలేశ్వరం శ్రీకాంత్, సుంకరి కమలాకర్, శ్రీధర్, శ్రీరామ అశోక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న వీఓఏలు

కౌటాల: ఐకేపీ వీఓఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట మండలంలోని వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజు ఆదివారం కొనసాగింది. సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చే శారు. తమ సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రవి, కొండ య్య, మహేశ్వరి, పద్మ, ఇందిరా పాల్గొన్నా రు.

'మన్‌కీ బాత్' వీక్షించిన బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ 100వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ప్రజలతో కలిసి వీక్షించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం పేరిట పనిభారం



మోడి గ్రామ పంచాయతీ కార్యాలయం

- టీఏ, సీసీలకు పంచాయతీ పనులు
- జేపీఎస్‌ల సమ్మెతో అదనపు బాధ్యతలు
- నేటి నుంచి తాత్కాలికంగా విధుల్లోకి..
- సర్దుబాటు చేసిన అధికారులు

కెరమెరి: మండల సమాఖ్య సీసీలు, ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏల నెత్తిన గ్రామ పంచాయతీ నిర్వహణ భారం పడనుంది. గత నెల 28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మెలోకి వెళ్లడంతో గ్రామ పంచాయతీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ మౌఖిక ఆదేశాల మేరకు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఉద్యోగులను సర్దుబాటు చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లోకి వచ్చే వరకు అదనపు బాధ్యతలు స్వీకరించిన సిబ్బంది నేటి నుంచి తాత్కాలికంగా పంచాయతీ విధులు, బాధ్యతలు నిర్వహించనున్నారు.



సమ్మెలో పాల్గొన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

తాత్కాలికంగా బాధ్యతలు అప్పగింత



జేపీఎస్‌ల స్థానంలో బాధ్యతలు స్వీకరించే సిబ్బంది తమ విధులతో పాటు అదనంగా గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలను తాత్కాలికంగా చేపట్టాల్సి ఉంది. సిబ్బంది కష్టం అనుకోకుండా పంచాయతీల పర్యవేక్షణ చేపట్టాలి. – సత్యనారాయణగౌడ్, ఎంపీడీవో

మండలంలో 31 గ్రామపంచాయతీలు..

మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉండగా 146 గ్రామాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 25 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉండగా ఒక్క రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో 30 మంది కింది స్థాయి సిబ్బందిని తాత్కాలికంగా నియమించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఈజీఎస్ ఏపీవో, ఐకేపీ ఏపీఎం, ఎఫ్ఏలు, జూనియర్ అసిస్టెంట్ తదితరులు కూడా పంచాయతీ విధులు నిర్వహించనున్నారు. ఆగర్‌వాడ గ్రామ పంచాయతీకి ఐకేపీ సీసీ కౌసల్యను నియమించగా, అనార్‌పల్లికి దస్తగిరి, సీసీ, అంతాపూర్ సుజాత, సీసీ, బాబేఝరికి నాగోరావు, టీఏ, భోలాపటార్‌కు రవీందర్, టీఏ, బోరిలాల్‌గూడకు మహేందర్, టీఏ, ధనోరాకు సుబ్బారావు, సీసీ, దేవాపూర్‌కు ధరంసింగ్, టీఏ, నిసాని, గోండ్‌గూడ గ్రామాలకు సుదర్శన్, ఎంపీవో, గోయగాంకు జీవన్, సీసీ, ఇందాపూర్‌కు ఐక్యానాయక్, ఈసీ, ఝరికి ధన్‌రాజ్, సీసీ, జోడేఘాట్‌కు నాగోరావు, టీఏ, కరంజివాడకు సత్తయ్య, సీసీ, ఖైరీ, కెలిబి గ్రామాలకు సత్యనారాయణ, ఎంపీడీవో, కెస్లాగూడకు శంకర్, సీసీ, రింగన్‌ఘాట్, కొఠారి గ్రామాలకు మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, మెట్టపిప్రికి, రాజేశ్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్, మోడికి శ్యాంరావు, సీసీ, పరంధోళి, ముకదంగూడలకు జైపాల్, సీసీ, పార్డకు చందు, ఎఫ్ఏ, సాకడకు సుధాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్, సాంగ్వికి ఆర్‌కే ప్రసాద్, ఎస్ఏ, సావర్‌ఖెడకు అంబాజి, టీఏ, సుర్దాపూర్‌కు ప్రకాశ్, ఆర్ఏ,తుమ్మగూడకు జగదీశ్వర్, ఏపీఎంలను కేటాయించారు.

ఇవీ విధులు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెప్రగతి కార్యక్రమంతో పాటు పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు, పారిశుధ్య నిర్వహణ, క్రీడాప్రాంగణం, నర్సరీ మెయింటనెన్స్, డంపింగ్ యార్డులు, సేంద్రియ ఎరువుల తయారీ తదితర పనులు నిర్వహించాల్సి ఉంటుంది. బర్త్, డెత్, మ్యారేజ్ తదితర సర్టిఫికెట్లను ఎంపీవో ధ్రువీకరిస్తారు. కాగా జేపీఎస్‌లు విధుల్లోకి చేరే వరకు గ్రామపంచాయతీల తాత్కాలిక బాధ్యతలు తమకు అప్పగించాలని కారోబార్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు డీఆర్‌డీవో సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: వాసవీమాత జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రాజశేఖర శర్మ, శేఖర్ శర్మ, నరేష్ శర్మ, సాయిశర్మ, శిరీష్‌శర్మల ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో రుద్రాభిషేకం, కుంకుమాభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు. చిలువేరు వెంకన్న, పిన్నా మహేష్, వివేక్, విశ్వేశ్వర్, మురళీ, దిలీప్, సంతోష్, క్రుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..



కాగజ్‌నగర్‌టౌన్: శోభాయాత్రలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ కన్యకా పరమేశ్వరి వాసవి అమ్మవారి జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేద పండితులు బాచంపల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిరంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. 108 వెదురు బుట్టలలో లక్ష పుష్పాలతో ఆర్యవైశ్యులు, మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్యనారాయణ, మురళీధర్, సురేష్, మురళీ, గోపాల్, గిరీష్ కుమార్, ప్రకాష్, నాగేశ్వర్ రావు, ముక్తేశ్వర్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న బాల భారతి పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి ఉన్నత పాఠశాలకు చెందిన 1996 -97 బ్యాచ్ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక వాసవి గార్డెన్స్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

1989- 90 బ్యాచ్ విద్యార్థులు..

స్థానిక పటేల్ గార్డెన్స్‌లో సర్‌సిల్క్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989 -90 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.



1989 -90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

బస్‌షెల్టర్లు లేక ఇక్కట్లు

- చెట్ల కింద నిరీక్షిస్తున్న మండలవాసులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

కౌటాల: మండలంలోని పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక గ్రామీణ ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు సిర్పూర్, కాగజ్‌నగర్, మంచిర్యాల పట్టణాలకు ఆయా గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్‌లు లేకపోవడంతో వాహనాల కోసం ఎక్కడ నిరీక్షించాలో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కింద నిరీక్షణ

మండలంలోని కొన్ని గ్రామాలు ప్రధాన రోడ్డుకు దూరంగా ఉండడంతో బస్‌షెల్టర్ లేక ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కనీసం ప్రధాన గ్రామాల్లో కూడా బస్‌షెల్టర్లు లేకపోవడంతో కిరాణాషాపులు, చెట్ల కింద వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వచ్చే వందలాది మంది ప్రజలతో పాటు విద్యా సంవత్సరంలో విద్యార్థులు సైతం అవస్థలు పడుతున్నారు. వీరంతా తిరుగు ప్రయాణంలో సమయానికి వాహనాలు లేకపోవడంతో గంటల తరబడి షాపుల వద్ద నిరీక్షిస్తున్నారు.



వీర్దండిలో చెట్ల కింద నిరీక్షిస్తున్న ప్రయాణికులు (ఫైల్)

పట్టించుకోని అధికారులు

మండలంలోని బోదంపల్లి గ్రామం నుంచి కాగజ్‌నగర్ వరకు సుమారు పది స్టేజీలున్నాయి. ఈ రూట్‌లో బోదంపల్లి, కన్నేపల్లి, గురుడుపేట్, యాపలగూడ, సదాశివపేట, శీర్షా, తదితర గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తుమ్మిడిహెట్టి, వీర్దండి, మొగడ్‌దగడ్‌లల్లో బస్‌షెల్టర్లు లేని విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

సమయానికి వాహనాలు రాకపోవడంతో గంటల తరబడి కిరాణాషాపుల వద్ద నిరీక్షిస్తున్నాం. కాగజ్‌నగర్ రూట్‌లో బోదంపల్లి, కన్నేపల్లి, గురుడుపేట, యాపలగూడ, సదాశివ పేట్, శీర్ష, తదితర గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిర్మించాలి.– సిద్ధయ్య, బోదంపల్లి

బస్‌షెల్టర్లు నిర్మించాలి

రోజూ వందల మంది రాకపోకలు సాగిస్తున్న మార్గంలో బస్‌షెల్టర్లు లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. వాహనాల కోసం మండుతున్న ఎండలో వేచి చూడాల్సి వస్తోంది. సమయానికి ఆర్టీసీ బస్సులు కూడా రావడం లేదు. అధికారులు స్పందించి మండలంలోని ప్రధాన సెంటర్లలో బస్‌షెల్టర్లు నిర్మించాలి.

– మహేశ్, వీర్దండి

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: రైటర్ పద్మభూషణ్

కాగజ్‌నగర్

వెంకటరమణ	: రైటర్ పద్మభూషణ్

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
రతాళం	60
గోబి(ఫూల్)	80
క్యాబేజ	80

-ఆసిఫాబాద్‌అర్బన్

పీఎంశ్రీతో బడికి మహర్దశ

- జిల్లాలో 13 పాఠశాలలు ఎంపిక
- ఒక్కో పాఠశాలకు రూ. 2కోట్ల నిధులు

ఆసిఫాబాద్‌రూరల్: పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) యోజన పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారనున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పీఎంశ్రీ కింద జిల్లాలోని 13 స్కూళ్లను ఎంపిక చేసింది. వీటిల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయనున్నారు. ఎంపికైన పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో నిరంతర శిక్షణ ఆధునిక పద్ధతులతో బోధన, విద్యార్థుల విజ్ఞానం పెంపొందేలా వృత్తి కోర్సులతో కూడిన విద్య అందించనున్నారు. ఈ పథకం కోసం జిల్లా నుంచి మండలానికి ఒకటి చొప్పున 30 స్కూళ్లను విద్యాశాఖ అధికారులు ప్రతిపాదించగా 13 పాఠశాలలు పథకానికి ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు 2023 –24 విద్యా సంవత్స రం నుంచి 2027 –28 విద్యా సంవత్సరం వరకు 5 సంవత్సరాల పాటు ఒక్కో స్కూల్‌కు రూ. 2 కోట్లు ఖర్చు చేయనున్నారు.

స్కూళ్లకు జియో ట్యాగింగ్..

పీఎం శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారనున్నాయి. వీటికి జియో ట్యాగింగ్ చేసి వాటిలో నిర్వహించే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. ఎంపికైె న 13 పాఠశాలలకు నిపుణుల కమిటీ ఆదేశాల మేరకు విడతల వారీగా నిధులు మంజూరు చేయనున్నారు. పాఠశాలల్లో క్రీడలు, ఐసీటీ (కంప్యూటర్ కోర్సు) కళలు, భాషా నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్ ఇలా విద్యాప్రమాణాలు కలిగిన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయనున్నారు. ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు స్వయంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాల్సి ఉంటుంది. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు వేస్ట్ మేనేజ్‌మెంట్, నీటి నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సాంప్రదాయ విధానాలు నేర్పిస్తారు. ఎల్‌ఈడీ బల్బులు, న్యూట్రిషన్ గార్డెన్, శుద్ధి చేసిన నీటి సరఫరా, వాతావరణంలో వచ్చే మార్పులు, సోలార్ విద్యుత్ సిస్టం, జిల్లాకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యావిధానంలో కలిగే మార్పులు చేపట్టనున్నారు. కేంద్ర విద్యాశాఖ నిబంధనల మేరకు ఎంపికైన 13 పాఠశాలలకు 60 శాతం కేంద్రం నిధులు, 40శాతం రాష్ట్రం నిధులు ఖర్చు చేయనున్నారు.



ఎంపికైన ఆసిఫాబాద్ మోడల్ స్కూల్

ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్లు



జిల్లాలోని 13 పాఠశాలలు పీఎంశ్రీయోజన పథకం కింద ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాయి. ఒక్కో పాఠశాలకు ఐదేళ్లలో రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నారు.

–అశోక్, డీఈవో

జిల్లాలో 13 పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 1263 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉన్నత పాఠశాలలు 168, ప్రాథమికోన్నత పాఠశాలలు 186, ప్రాథమిక పాఠశాలలు 909 ఉన్నాయి. డీఈవో పరిధిలో 747 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో లోకల్‌బాడీ 684, మోడల్‌స్కూల్ 2, కేజీబీవీలు 15, ఎయిడెడ్ ప్రభుత్వ పాఠశాలలు 13 ఉన్నాయి. వీటిలో పీఎంశ్రీ యోజన పథకం కోసం జిల్లా నుంచి 13 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో ఆసిఫాబాద్‌లోని మోడల్ స్కూల్, కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్ నగర్ విలేజ్ నం.3 ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని ఉన్నత పాఠశాల (ఓల్డ్), దహెగాం మండలంలోని చిన్నరాస్పల్లి, చింతలమానెపల్లి జెడ్పీ హైస్కూల్ బాబాసాగర్, బెజ్జూర్ మండలం సలుగుపల్లి ప్రాథమిక పాఠశాల, కెరమెరి మండలం సావర్‌ఖుథా యూపీఎస్, కౌటాల మండలం బండల్ హెట్టి యూపీఎస్ స్కూల్, పెంచికల్‌పేట్ జెడ్పీ హైస్కూల్, సిర్పూర్(టి) జెడ్పీహై స్కూల్, సిర్పూర్(యూ) మోడల్ స్కూల్, రెబ్బెన ఉన్నత పాఠశాల, వాంకిడి కేజీబీవీ స్కూల్స్ పీఎం శ్రీ పథకం కింద ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు 5సంవత్సరాల పాటు పాఠశాల పీఎంశ్రీ యోజన ద్వారా రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నారు.

'సీఎంకు కృతజ్ఞతలు'

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తూ ఆదివారం సీఎం నూతన సచివాలయంలో సంతకం చేసిన నేపథ్యంలో జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో 118 మంది అధ్యాపకులు పని చేస్తున్నట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

పెంచికల్‌పేట్‌లో భారీ వర్షం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి చేతికి అందివచ్చిన వరి పంట పూర్తిగా దెబ్బతింది. కల్లాల్లో ఉన్న పంటను రక్షించుకోవడానికి అన్నదాతలు పరుగులు తీశారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో వందల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మందమర్రిరూరల్: వర్షాలతో పంటకు నష్టం కలుగుతుందని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు.